క్లుప్తంగా

మెడికల్ కిట్లు పంపిణీ

ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నల్లమోతుల రమేష్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర నాయకులు బీపీ నాయక్ సూచనలు మేరకు మెడికల్ కిట్లు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, రాజేందర్, వీరు, బిక్షం, దర్గయ్య పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయాలి

కొణిజర్ల: రెండో విడత గొర్రెల పంపిణీకి.. డీడీలు తీసిన ప్రతీ లబ్ధిదారుడికి గొర్రెల పంపిణీ నగదు బదిలీ చేయాలని డీసీసీబీ డైరెక్టర్, గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లి బాబు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కొణిజర్లలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడతలో ఒక్కో యూనిట్‌కు రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా గొర్రెల పంపిణీ చేయలేదన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. అప్పుడు తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భద్రయ్య, ఎల్లిబాబు, ముత్తయ్య, నాగ, శివ, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి

సత్తుపల్లి: శిథిలావస్థకు చేరిన శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మరమ్మతులు చేయాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించి రాస్తారోకో చేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చునేందుకు పైకప్పు లేదని.. బల్లలు లేవని.. ఇటువంటి కళాశాలలో ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబు విద్యార్థులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింప చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు దోమా దీపక్, చక్రవర్తి, సాయిగోవర్ధన్, మోరంపూడి ధనీష్, ప్రశాంత్ రెడ్డి, కార్తీక్. రాజీవ్, నవనీత్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఆపొద్దు..



మాట్లాడుతున్న మందా సైదులు


మధిర: ఎన్నికల కోడ్ సాకుతో రైతుల రుణమాఫీ ఆపవద్దని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జిల్లా నాయకుడు మందా సైదులు కోరారు. ఆదివారం రాత్రి మండలంలోని నక్కలగరుబు గ్రామంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు రూ.లక్ష రుణ మాఫీ చేయాలన్నారు.

విప్లవ కెరటం చేగువేరా

మధిర: అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి పేదల, అణగారిన వర్గాల గొంతుక వినిపించిన విప్లవ కెరటమే చేగువేరా అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అన్నారు. మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం విప్లవ తార చేగువేరా 56వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్సాహం, ఉత్తేజం, విప్లవ చైతన్యం, సాహసం, క్రమశిక్షణ, పట్టుదల, తెగింపు, కష్టపడే తత్వం వీటన్నింటినీ కలిపి పోతపోస్తే ఏర్పడే రూపమే చేగువేరా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపి, ఏడుకొండలు, లక్ష్మణ్, నాగేశ్వరరావు, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

– యూత్ కాంగ్రెస్ జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా రాజీవ్‌గాంధీ..



రాజీవ్ గాంధీ

ఎర్రుపాలెం: కాంగ్రెస్ పార్టీ యూత్ విభాగం ఖమ్మం జిల్లా మీడియా కో–ఆర్డినేటర్‌గా ఎర్రుపాలెం గ్రామానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ రాజీవ్ గాంధీని నియామకం అయ్యారు. ఈ మేరకు స్టేట్ మీడియా డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ వరుణ్‌పాండే నుంచి తమకు ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

సాయిస్ఫూర్తిలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రోగ్రాం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ నల్లంటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ప్రోగాం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ.. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది జాతీయస్థాయి పోటీ ఇక్కడ మీరు మీ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం లభిస్తుందని, మీ ప్రాజెక్టు గురించి చాలా స్పష్టంగా ఉండండి, మీరు మీ ఆలోచనను ప్రదర్శిస్తున్నప్పుడు చాలా నమ్మకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, అన్ని బ్రాంచ్‌ల విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టపగలు రెక్కీ.. రాత్రి చోరీ

- మాయమవుతున్న వ్యవసాయ మోటార్లు
- కలవరపడుతున్న అన్నదాతలు
- ఎండుతున్న పంటలు

గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు వరసగా చోరీకి గురవుతున్నాయి. పట్టపగలు రెక్కీ మొదలు పెట్టి.. అర్ధరాత్రి చోరీకి పాల్పడుతున్నారు. ఒకప్పుడు రాత్రుల్లో విద్యుత్ సరఫరాలకోసం ఎదురుచూసే రైతులు, ప్రస్తుతం దొంగల నుంచి మోటార్లను కాపాడుకునేందుకు ఎదురుచూస్తున్నారు.



వల్లబి వద్ద పొలాల్లో చోరీకి గురైన మోటార్లను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



వల్లబి వద్ద సాగర్‌కాలువపై ధ్వంసం చేసిన మోటార్లు (ఫైల్)

ముదిగొండ: ముదిగొండ మండలంలోని వల్లబి, మేడేపల్లి తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు తెల్లవారేసరికి మాయమవుతున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఒకటి కాదు రెండు కాదు వరసగా దాదాపు 24విద్యుత్ మోటార్లలలోని కాపర్‌వైర్‌ను దుండగులు ఎత్తుకెళ్లుతున్నారు. సాగర్‌కాలువలు, వ్యవసాయ బావులపై ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుట్టుచప్పుడు కాకుండా దొంగలు ఎత్తుకెళ్తున్నారు. విద్యుత్ మోటార్లలో ఉండే విలువైన రాగితీగ కోసం చోరీలకు పాల్పడుతున్నారు. సాగర్‌కాలువలపై అమర్చిన మోటార్లలో కాపర్‌వైరు ఉండే బాగం వరకు కట్‌చేసి ఎత్తుకుపోతున్నారు. పొలానికి నీళ్లు పెట్టడంకోసం వెళ్లిన రైతులకు మోటార్లు కనిపించక లబోదిబోమంటున్నారు.

ఆందోళనలో అన్నదాతలు..

పంటలకు సాగునీరు అందించడం కోసం అప్పులు చేసిమరీ కొనుగోలు చేసి అమర్చిన మోటార్లు చోరీకి గురికావడంతో రైతన్నలు ఆందోళనకు గురౌతున్నారు. మళ్లీ కొనుగోలు చేద్దామన్నా, ఎంత వరకు కాపాడుకోగలమా అని ఆవేదనలో ఉన్నారు. వరస దొంగతనాలతో భయపడిన రైతులు.. పంటలను కాపాడుకునేందుకు కిరాయిలకు తెచ్చి బావుల వద్ద నీటిని పెట్టుకుంటున్నారు.

గత రెండు నెలలుగా చోరీలు..

ముదిగొండ మండలంలో గత రెండు నెలల నుంచి విద్యుత్ మోటార్లు చోరీకి గురౌతున్నాయి. మేడేపల్లిలో ఇటీవల 6విద్యుత్ మోటార్లు, వల్లబిలో దాదాపు 18మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు వాపోతున్నారు. వల్లబిలో ఎక్కువగా కాపర్‌వైరు ఉన్న బాగాలను ఎత్తుకెళ్లగా.. మరికొన్ని చోట్ల మోటార్లనే ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఒక్కో రైతు పొలంలో రెండు, మూడు దఫాలుగా కాపర్‌వైర్లు చోరీకి గురికావడం గమనార్హం. పోలీస్‌లు తగిన చర్యలు చేపట్టి దొంగల ముఠాను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటలు ఎండుతున్నాయి..



నేను మూడెకెరాల్లో మిర్చి పంట వేశాను. సాగర్‌కాలువపై అమర్చిన మోటార్ సాయంతో పంటకు నీరు అందిస్తున్నాను. ఈ క్రమంలో గుర్తుతెలియని దొంగలు రెండుసార్లు విద్యుత్ మోటార్లలోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. దాని విలువ సుమారు రూ.2 వేలు అయినా.. మోటార్‌మొత్తం రూ.20 వేల వరకు ఖర్చు వస్తుంది. పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– పిల్లుట్ల వెంకటేశ్వర్లు, రైతు, వల్లబి

మోటార్లు మాయమవుతున్నాయి..



నేను రెండెకరాల్లో మిర్చి పంట వేశాను. దొంగలు రాత్రి సమయంలో విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే పొలానికి నీరుపెడదామని వెళ్లే సరికి మోటార్ అగపడలేదు. పోలీసులు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించారు. పంట ఎండిపోతుంది. దొంగలు సాగర్‌కాలువపై మోటార్లలోని రాగి వైర్లను కత్తిరించుకుపోతున్నారు.

– పి.రమేష్, రైతు, వల్లబి

గస్తీ పెంచాం..



వ్యవసాయ బావులు, సాగర్ కాలువల వద్ద రైతుల విద్యుత్ మోటార్లలోని కాపర్‌వైరును వేరు చేసి చోరీ చేస్తున్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేస్తున్నాం. చెక్‌పోస్టుల వద్ద చెక్ చేస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీని పెంచాం. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నాం. రెండు విద్యుత్ మోటార్లలోని కాపర్‌వైరును రికవరీ చేశాం. దొంగలను పట్టుకుని తీరుతాం.

– ఎస్సై నరేష్, ముదిగొండ

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్

వైరా: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ అన్నారు. సోమవారం వైరాలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విదానాలను వివరిస్తూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని.. ఇప్పుడు కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే మేలు జరిగిందన్నారు. రైతులను అప్పుల పాలు చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో.. గ్యారంటీ స్కీం అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, మట్టూరి వీరయ్య, వల్లపు కొండలు, పణితి శ్రీను, కిరణ్, వెంకటరావు, రాము, కోటేశ్వరరావు, వీరయ్య, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఔషధరంగంలో మెరుగైన వసతులు



మాట్లాడుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు

కొణిజర్ల: ఫార్మారంగంలో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని తనికెళ్ల సమీపంలో గల బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సర విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మసీ ప్రాధాన్యత మందుల వాడకం, పని తీరును గురించి వివరించారు. డీన్ డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రముఖ విద్యావేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా రమేష్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి అంకిత భావంతో పట్టుదలతో ఔషధ విద్యనభ్యశించాలన్నారు. కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాద్ పాత్రో, ఏఓ సీహెచ్ హన్మంతరావు, మిట్టపల్లి అప్పారావు, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఎంపికైన కానిస్టేబుళ్లకు సన్మానం

చింతకాని: కానిస్టేబుళ్లుగా ఎంపికైన మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన కందిమళ్ల నవీన్, కాసాని సతీష్, బాహోటం ప్రదీప్‌కుమార్, శ్రీలతలను గ్రామపెద్దలు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో విధులను నిర్వర్తిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆలస్యం నాగమణి, ఉపసర్పంచ్ వినోద, గ్రామపెద్దలు బసవయ్య, గోపాలరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గోపి, సైదులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముదిగొండ: మండలంలోని మేడేపల్లిలో ఉచిత వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో ముదిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సర్పంచ్ సామినేని రమేష్, సీహెచ్ఓ దుర్గామల్లేశ్వరి, సూపర్‌వైజర్లు లత, నాగమణి, సరోజిని, ఏఎన్ఎం అరుణకుమారి లు పాల్గొన్నారు.

ఆందోళనలను జయప్రదం చేయాలి

చింతకాని: ఈ నెల 11న దేశవ్యాప్తంగా మండల కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వత్సవాయి జానికిరాములు తెలిపారు. సోమవారం మండలంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి రాగానే.. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని అనేక చర్యలను చేపట్టిందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దేశబోయిన ఉపేందర్, మండల నాయకులు గోపయ్య, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నాగయ్య, లక్ష్మయ్య, కిలారి కిరణ్, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో.. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్రపాటి సాలమన్‌రాజు అధ్యక్షతన బూత్ మెంబర్ 189, 190లో నాయకులు కాంగ్రెస్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివవేణు, గోళ్ల అప్పారావు, అలావత్ వెంకటేశ్వరరావు, కాలం కృష్ణ, హరిప్రసాద్‌రెడ్డి, కుమారి, సరోజ, మున్వర్‌హుస్సేన్, రాజేష్, కోటేశ్వరరావు, చెన్నారావు, జ్యోతి, మంగ, శరమ్మ, రాములమ్మ, దుర్గ, మాణిక్యం, సావిత్రి, ఇందిర, రాధ, మమతశ్రీ, రమ్యశ్రీ, దివ్యశ్రీ పాల్గొన్నారు.

మండలంలో సర్పంచ్‌ల బిక్షాటన



కొణిజర్లలో బిక్షాటన చేస్తున్న సర్పంచ్‌లు

కొణిజర్ల: గత 18 నెలలుగా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన గ్రాంట్లు మంజూరు చేయాలని కోరుతూ.. మండలంలోని పలువురు సర్పంచ్‌లు సోమవారం మండల కేంద్రంలో బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా కొణిజర్ల, పెద్దమునగాల సర్పంచ్‌లు సూరంపల్లి రామారావు, పరికపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. బిల్లులు మంజూరుకాక.. పంచాయతీ నిర్వహణకు తెచ్చిన వడ్డీలు కట్టలేక సతమత మవుతున్నామన్నారు. కనీసం వర్కర్లకు కూడా నెలనెలా వేతనాలు ఇవ్వలేక పోతున్నామన్నారు. అనంతరం ఎంపీడీఓ కె.మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కమటాల రేణుక, చాదరాసిపల్లి జ్యోతి, రంగు సత్యనారాయణ, మహేష్, షేక్ అఫ్జల్‌బీ, పుల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల చేయాలని రైతుసంఘం జిల్లా సమితి సభ్యుడు పారుపల్లి నరసింహారావు అన్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టు కింద వేసిన వరి, పత్తి, మిరప, చిరుదాన్యాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబీమా, పంటలబీమా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం తహసీల్దార్ పున్నం చందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జక్కా నాగభూషణం, ఆకెన పవన్, గుడిద కృష్ణ, వంగాల సురేష్, తోటపల్లి ఆనందరావు, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



సత్తుపల్లి జేవీఆర్ ఓసీ గేటు ఎదుట ఆందోళన చేపట్టిన మహిళలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సింగరేణి క్వార్టర్స్‌లో సౌకర్యాలు కల్పించాలని.. జేవీఆర్, కిష్టారం ఓసీలలో పనిచేస్తున్న ఉద్యోగుల మహిళలు సోమవారం జేవీఆర్ ఓసీ ఎదుట ఆందోళన చేపట్టారు. క్వార్టర్స్ నిర్మించారు కానీ.. ఇక్కడ డ్రెయినేజీ, రోడ్లు నిర్మించలేదని, వీధిలైట్లు అంతతమాత్రంగానే ఉన్నాయన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతిధులకు విన్నవించిన ఫలితం లేదన్నారు. ఈ ప్రాంతంలోని బెల్ట్‌షాపుల కారణంగా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఓ వద్దకు వెళ్లి విన్నవించుకుందామంటే బయటకు రావటం లేదని ఆరోపించారు. సౌకర్యాలు కల్పించకుండా క్వార్టర్స్‌లో నివాసం ఉండాలని ఆదేశించటం తగదన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటరాజు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ పేజ్–2లో భాగంగా ఈజీఎస్ ఏపీడీ వెంకటరాజు ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై సమగ్రంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీఓ కె.నాగరాజు, టీఏలు విజయలక్ష్మి, కాంతమ్మ, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



గృహలక్ష్మి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి/వేంసూరు: ప్రజల సమస్యల పరిష్కారానికి మీలో ఒకడిగా పని చేశా.. మీ దీవెనలు.. మీ ఆశీర్వాదాలు అందించి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో, వేంసూరులోని రైతు వేదికలో సోమవారం గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ వచ్చినా అమలులో ఉన్న ఏ పథకాలు ఆగవని.. ఈ నెల 16న సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారని తెలిపారు. ఎన్టీఆర్ తర్వాత సంక్షేమ పథకాలు అందించటంలో సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎస్కే రఫీ, యాగంటి శ్రీను, మట్టా ప్రసాద్, మోరంపూడి ప్రభాకర్, మందపాటి వాసురెడ్డి, వేంసూరులోని.. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్, గొర్ల శ్రీనివాసరెడ్డి, ఎండీ పైజుద్దీన్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



ఎర్రుపాలెం: హెల్త్ సబ్‌సెంటర్ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

మధిరరూరల్: మండలంలోని దెందుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో పల్లె ప్రగతి ద్వారా అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి, సొసైటీ అధ్యక్షులు కోట వెంకటకృష్ణ, నాయకులు విజయ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు..

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి, ఎర్రుపాలెం గ్రామాల్లో నిర్మించిన పీహెచ్‌సీ హెల్త్ సబ్‌సెంటర్లను సోమవారం జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ ప్రారంభించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంబి సాంబశివరావు, యన్నం శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంపీటీసీలు షేక్ మస్తాన్‌వలీ, మల్లికార్జునరెడ్డి, రామకోటేశ్వరరావు, నరసింహా, సొసైటీ చైర్మన్లు శ్రీనివాసరావు, మధుసూధన్‌రెడ్డి, మదన్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ బాలరాఘవరెడ్డి, చిట్టిబాబు, రవి, శిరీష, విజయ్‌బాబు, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



చింతకాని: లచ్చగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ హనుమంతురావు, సర్పంచ్ ఝాన్సీ, చింతకాని సొసైటీ డైరక్టర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

ముదిగొండ: మండలంలోని వెంకటాపురంలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సీసీరోడ్డుకు సోమవారం సర్పంచ్ అనంతరాములు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బాలచందర్, బాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రావు, బుచ్చిరామయ్యలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు..



పోలీసులు అదుపులో ఎస్ఎఫ్ఐ నాయకులు

సెకండ్ ఏఎన్ఎంల..

సత్తుపల్లిరూరల్: గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను హైద్రాబాద్ ధర్నాకు వెళ్లకుండా సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం సీఐ మోహన్‌బాబు ముందస్తు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సెకండ్ ఏఎన్ఎంలు మంజుల, లక్ష్మి, సునీత ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులు..

సత్తుపల్లిరూరల్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సత్తుపల్లి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిని పోలీసులు అడ్డుకొని సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బెజవాడ సాయిశేషు, నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సాయిశేషు మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలకై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అడ్డుకొని అరెస్ట్ చేయడం పోలీసులకు తగదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నాగకృష్ణ, సత్తుపల్లి మండల కార్యదర్శి యశ్వంత్‌కుమార్, అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, గర్ల్స్ కన్వీనర్ అనూష, భవాని, నాయకులు పాల్గొన్నారు.

కోడి కూసింది.. ముసుగు పడింది

అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియమావళి

ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. అధికార యంత్రాంగం.. గ్రామాల్లో ఉన్న పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్లెక్సీలు, బ్యానర్లు, రాజకీయపార్టీల నాయకులు కట్టిన పార్టీ గుర్తులతో ఉన్న తోరణాలను తొలగించారు. ఈ సందర్భంగా పోలీసులు మండలాల్లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు ప్రవర్తన నియమాలను ఖచ్చితంగా పాటించాలని పలువురు అధికారుల అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన దృశ్యం



పెనుబల్లి: ముత్తగూడెం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్



సత్తుపల్లిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



ముదిగొండలో..



చింతకాని: విగ్రహానికి ముసుగు వేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



కారేపల్లి: క్రాస్‌రోడ్డులో పార్టీ దిమ్మెను క్లాత్‌తో మూసేస్తున్న పంచాయతీ సిబ్బంది